

-పి.ఎస్.నారాయణ

# అందం

ఉగాది కథల పోటీలో ఎంపికైన కథ

“చూడండి రామ్మూర్తిగారూ! మా యింట్లో గురువారం వీలుపడదు... మా అమ్మకు ఆరోగ్యం బాగోలేదు... ఆమె లేచి స్నానం చేసి పూజలయ్యేటప్పటికే పది గంటలవుతుంది... మీరు కాలేజీకి వెళ్ళేలోగా భోజనం పెట్టలేం... మీరు మా యింటికి ఆదివారం వస్తే బాగుంటుంది!” అన్నది. “సరే రాత్రికంటే ఎలాగో అలాగా ఎడ్జెస్ట్ అవుతాం... పగలు మాత్రం మాకు కుదరదు!”

రామ్మూర్తి ఆలోచనలో పడ్డాడు. ‘అంటే గురువారం తనే క్కడయినా చూచుకోవాలన్నమాట!’ అనుకున్నాడు.

తనకు గురువారమే కావాలని చెప్పలేడుగదా. వాళ్ళ దయా ధర్మభిక్షం క్రింద ఒక రోజు భోజనం పెడతామన్నారు. వారికి వీలైన రోజునే తను రావాలి... అంతేగాని తనకు ఈరోజే కావాలని ఎలా గట్టిగా అడగ గలుగుతాడు?

‘సరే’నన్నట్లుగా తల ఊపి ఆ ఇంట్లోనుంచి బయటకు వచ్చేశాడు. శ్యామల లోపలికి వెళ్ళింది. “అమ్మా! మీ వారాలబ్బాయికి మనింటికి గురువారం రావటం కుదరదట... ఆదివారం పెట్టమంటున్నాడు... ఏఁవంటావ్?” అన్నది.

“ఆదివారం ఎలా కుదురుతుందే మనకు... ఆరోజు ఎవరో ఒకరు వస్తూనే వుంటారు... ఇంకా ఇతడికిగూడా ఎక్కడ చేసేది?”

“ఏమో... ఆయనగారి కోరిక అది!” అంటూనే అక్కడ నుంచి వెళ్ళబోతూ, “పోనీలే అమ్మా! అతడిని మళ్ళా అడగబోకు... ఆదివారం నేను ఇంట్లోనే వుంటానుగదా... నీకు వంటింట్లో సాయం చేస్తానులే... నువ్వు అతడికి భోజనం పెడుతున్నంత సేపు!” అంటూనే తన గదిలోకి వెళ్ళి తనని తాను చూచుకుంటూ అద్దంముందు నిలబడింది.

-ఏమిటో బుద్ధావతారం... అంత అందంగా వుంటాడు... క్లాసులో నేనే ఫస్టు అంటాడు... అందమైన తనలాంటి ఆడపిల్లని ఒక్కసారైనా కళ్ళెత్తి చిలిపిగా చూడటం తెలియదు!

రామ్మూర్తి అందమైనవాడు. ఆరడుగుల పొడుగు... తెల్లగా వుంటాడు... నొక్కుల నొక్కుల జుట్టు... ఒకసారి చూస్తే మరోసారి చూడాలనే అందం... అందమైన శ్యామల అతగాడు తనను నిర్లక్ష్యం చేస్తున్నాడు అనుకోవటంలో తప్పులేదు. ఆమెకు అతడిని మించిన అందం వున్నది. ఆపైన డబ్బు వున్నది. వీటికి తోడు కావాల్సినంత అహం వున్నది. అందుకే అతడిని ఒక చూపు చూడాలనుకున్నది. రామ్మూర్తికి ఇవేం తెలియదు. ఏరోజు నిర్ణయించుకున్న యింటికి ఆరోజు రెండు పూటలా భోజనానికి వెళ్ళటం... బుద్ధిమంతుడిలా తలవంచుకు భోజనం చేయటం... వాళ్ళు ఎప్పుడైనా ఏమైనా అడిగితే ముక్తసరిగా సమాధానం చెప్పటం... ఓ పెద్దమనిషి అంగీకరించి ఇచ్చిన వాళ్ళ కారు షెడ్డులో తన చాపమీద కూర్చొని చదువుకోవటం- ఆపైన అక్కడే పడుకోవటం... అవి మాత్రమే తెలుసు అతడికి!

* * *

ఆదివారం ఆలస్యంగా లేచిన శ్యామల హడావుడిగా స్నానం చేసి మంచి డ్రస్సు వేసుకుంది. అద్దంముందు అరగంటసేపు మొఖాన్ని అందంగా అలంకరించుకుంది.

పదకొండు గంటలప్పుడు ఏదో పుస్తకం తిరగేస్తూ కూర్చున్న కూతురుని చూస్తూనే, “ఇంకా ఎక్కడికీ ఊరేగలేదేం ఇవ్వాళ... ఆదివారం స్నేహితురాళ్ళ కొంపల చుట్టూ తిరగటం అలవాటేగా!”అన్నది నవ్వుతూ.

“నేనంటే నీకు ప్రతిదానికీ ఎగతాళేనమ్మా! ఇక్కడ నుంచీ నీకు ఆదివారంపూట హెల్ప్ చేస్తానని చెప్పానా... పొద్దుటి నుంచి చూస్తున్నాను గదా ఒక్కసారైనా పిలిచావా వంటింట్లోకి నన్ను!” అన్నది మూతిని సున్నాలా చుట్టి తల్లిని మురిపెంగా చూస్తూ. “గుర్తుంచుకో... ఇకనుంచీ నేను ఆదివారం ఎక్కడికీ వెళ్ళను... నాకు వంట చేయటం నేర్పు!” అన్నది.

సరిగ్గా అప్పుడే వాకిట బెల్ మ్రోగింది.

“పెళ్ళి కావాల్సిన దానివి... మంచి సలహానే ఇచ్చారన్న మాట... నీకెవరో!”

“పెళ్ళయినా నాకు వంట చేయాల్సిన అవసరం పడదులే... నేర్చుకుంటే తప్పులేదులే అని నేర్చుకుందామనుకున్నాను!”

“వంటొచ్చిన మగవాడిని చేసుకుంటావేమిటే ఖర్మ!” అన్నది తల్లి.

గది బయట పనిమనిషి నిలుచుని, “మనింట్లో భోజనం చేసే వారాలబ్బాయి వచ్చాడమ్మా!” అన్నది.

“వస్తున్నా పద!” అంటూ శ్యామల తల్లి లోపలకు వెళ్ళిపోయింది.

వెనగ్గా వచ్చి శ్యామల రామ్మూర్తిని చూస్తూనే, “ఆఫ్ ఇయర్లీ ఎగ్జామ్స్ ఎప్పుడో తెలిసినయ్యా అండీ!” అన్నది.

“తెలియదండీ!” అన్నాడు తల వంచుకొని.

అతడు, ఆమె ఒకే చదువులో వున్నారు. ఇద్దరిదీ ఒకే కాలేజీ. ఒకే సెక్షన్...

పనమ్మాయి వచ్చి వంట యింటి తలుపునకు పక్కగా నేల శుభ్రంచేసి, పీట వేసి, దొడ్లో కోసిన అరిటాకును పరిచి వెళ్ళింది. రామ్మూర్తి మెదలకుండా వెళ్ళి పీటమీద కూర్చున్నాడు.

శ్యామల తల్లి వడ్డిస్తుంటే శ్యామల డైనింగ్ టేబుల్ దగ్గర కుర్చీలో సినిమా పత్రికలో బొమ్మలు చూస్తూ కూర్చున్నది కాళ్ళూపుకుంటూ. తను గంటసేపు గదిలో కూర్చుని శ్రమపడిమరీ అలంకరించుకున్నదంతా వృధానేనా? కనీసం కంటికొనతోనైనా తనవైపు చూడటం లేదు. అతడికి ఎదురుగ్గా తను కూర్చున్నట్లుగా అతడికి తెలియటంలేదా?

ఆమె కోరికల్లా అతడు నోరు తెరుచుకొని తనవంక తాదాప్యంగా చూస్తుంటే అతడి స్థానమేమిటో అతడికి తెలియచెప్పాలని! అతడి తెలివిని కాలేజీలో అందరూ చెప్పుకుంటుంటే తన ముందు మాత్రం దీనంగా పడివుండాలని!

అప్పటికీ, ఆ వంకనా ఈ వంకనా డైనింగ్ టేబుల్ మీద వున్న వస్తువుల్ని పెద్ద శబ్దమయ్యేలా అటూ యిటూ కదిలిస్తూనే వున్నది.

కానీ అతడు తల ఎత్తనయినా లేదు. అటువైపుకు చూడనే లేదు.

ఆమె ఆలోచనలలో వుండగానే, అతడు భోజనం చేయటం, చేయి కడుక్కోవటం, వంట యింటి తలుపు దగ్గర నిలబడి, “వస్తానండీ... గురువారం వచ్చినట్లుగానే మామూలుగా రాత్రి ఎనిమిదింటికి రమ్మనమంటారా?” అన్నాడు.

“నీ యిష్టం... ఎనిమిది గంటల తరువాత ఎప్పుడొచ్చినా ఫరవాలేదు!”

అతడు అటు వెళ్ళగానే, వంట యింట్లోకి వచ్చి, “నాకు తెలియక అడుగుతాను... అతడు మా కాలేజీలో నాతోబాటే చదువుతున్నాడుగదా... వారాలబ్బాయి కాబట్టి క్రిందనే పెట్టాలా భోజనం... డైనింగ్ టేబుల్ మీద పెట్టగూడదా?” అన్నది తల్లితో శ్యామల.

తల్లి విస్తుపోయి కూతురు మొఖంలోకే చూస్తూ వుండిపోయింది!

* * *

ఇంటర్వల్ బెల్ కొట్టగానే రామ్మూర్తి అలవాటుగా లైబ్రరీకి వెళ్ళేటందుకుగాను వరండాలో అడుగులు వేస్తుండగా ఎదురుగా శ్యామల వస్తూ కనబడింది. ఆమె పక్కనే తన క్లాసు వాడే మురళీధరం, తన సీనియర్ ప్రసాదు వున్నారు.

శ్యామల పెద్దగా నవ్వుతూ ఏదో చెబుతుంటే వాళ్ళిద్దరూ చప్పట్లుకొట్టి మరీ నవ్వుతున్నారు.

రామమూర్తి ఆమెను దాటి వెళుతుండగా ఆమె అన్నమాటలు స్పష్టంగా వినబడినయ్. "కొందరు ఉదయం, సాయంత్రం భోజనాలతోనే సరిపెట్టుకుంటారు. కాని నాకు మాత్రం ఇంటర్వెల్‌లో కాస్త టిఫెన్ తిని కాఫీనో, కూల్ డ్రింకో త్రాగందే అస్సలు బుర్ర పనిచేయదు!"

పక్కవాళ్ళు వెంటనే వంతపాడారు: "నాకూ అంతే... నాకూ అంతే!" అంటూ.

"ఇవ్వాళయితే మనం పిజ్జా తినాలి!" అన్నది శ్యామల.

"ఓకే... ఓకే... పదండి!"

రామమూర్తికి అర్థమయింది శ్యామల తను వినేలా అలా ఎందుకు అన్నదో. తన లేమిని ఆమె స్నేహితుల దగ్గర ఎత్తి చూపుతూ తన గొప్పతనాన్ని తన ముందు ప్రదర్శించుకోవాలనే ఉబలాటం అన్నమాట... మనస్సులో బాధ వేసింది.

తన గురించి తెలిసిన ఒక దూరపు బంధువు ఆయనే ఫీజుకట్టి తనను కాలేజీలో జేర్పి వారాలు కుదిర్చాడు భోజనానికి.

ఒకరోజు వీళ్ళింటికి భోజనానికి వెళ్ళినప్పుడు గాని తనకు తెలియలేదు- అది తన క్లాసుమేటు శ్యామల ఇల్లని!

తనకు చాలా చిన్నతనమేసింది.

అయినా వారాలంటూ వెళ్ళటం మొదలుపెట్టిన తరువాత ఇంకా నామోషీ దేనికి? తెలిసిన వాళ్ళయినా ఒకటే... తెలియని వాళ్ళయినా ఒకటే...

తను తల వంచుకు భోజనం చేయటం, బయటకు వచ్చేయటం... తన చదువేదో తను చదువుకోవటం...

కానీ అప్పుడప్పుడూ అనిపిస్తుంటుంది- శ్యామల ఎందుకో తనని కవ్విస్తున్నదని!

బహుశః ఆమె అందం అనే అహంతో నిండి వున్నది... అందరిలాగానే తనూ ఆమెకు భజన చేయాలనుకుంటున్నదేమో?

* * *

దసరా శెలవలకు నాగార్జునసాగర్ ఎక్స్‌కర్షన్ ఎరేంజ్ చేసారు కాలేజీ తరపున. అప్పటికి నాలుగురోజులయింది సర్క్యులర్ వచ్చి.

లంచ్ టైంలో లైబ్రరీలో పుస్తకం చదువుకుంటుండగా రామమూర్తి ఎదురుగా శ్యామల వచ్చి కూర్చున్నది.

"ఎలా చదువుతున్నారు?"అన్నది నవ్వుతూ ఎదురుగ్గా కూర్చుంటూనే.

"ఫరవాలేదు!"

"మీకేమండీ!... ఫస్టు మార్కులన్నీ మీకే... అవునూ ఎక్స్‌కర్షన్‌కు వస్తున్నారా?" అడిగింది కాస్త ముందుకు వంగి.

"లేదండీ... రావటం లేదు!"

"మనీ ప్రాబ్లమా?"

"అనే కాదు... టైం వేస్టుగూడా... వెళ్ళొచ్చింతరవాత మరో రోజు రెస్టు... రెండ్రోజుల చదువుపోతుంది!"

"మీరే చదువుపోతుందని దిగులుపడితే యావరేజ్ మార్కులు వచ్చే మేం ఏం కావాలి... చదువుతోనే మన బుర్రలు పాడుచేసుకోగూడదు... కాస్త అప్పుడప్పుడూ రిలాక్స్ అవ్వాలి... మీ పేరున నేను డబ్బు కట్టేస్తున్నాను... మీరూ వస్తున్నారు!" అన్నది లేచి నిలబడుతూ.

"వద్దండీ... వద్దు!" అన్నాడు అతడు వడివడిగా లేస్తూ.

"ఊహూ... మీరు రావాలి... మన సెక్షన్‌లో అందరూ పేర్లు ఇచ్చారు... ఒక్క మీరే ఇవ్వలేదు... నేను మిమ్మల్ని కూడా రమ్మనమని చెప్పటానికి వచ్చాను!"

"నాకిష్టం లేదండీ!"


"ఫరవాలేదు... ఆరోజు వారం ఏలాగూ మా యింట్లోనే గదా... నా లంచ్‌తోపాటు మీకూ తెస్తాను... మీరు కాదన వద్దు!" అంటూనే అతడికి మరో మాటకు అవకాశమివ్వకుండా లైబ్రరీలోనుంచి బయటకు వెళ్ళిపోయింది.

రామమూర్తి అవాక్కయి ఆమె వెళ్ళినవైపే చూస్తూ వుండిపోయాడు.

అక్కడ అందరిముందూ తన క్యారియర్‌లో భోజనం పెట్టి తనను వాళ్ళింట్లో వారాలబ్బాయిగా చూపించేటందుకా?

* * *

శనివారం మధ్యాహ్నం క్లాసునుంచి ఇక ఇంటికి వెళదామని బయటకు వస్తుంటే శ్యామల ఎదురొచ్చి, "మీరు రేపు రాకుండా మానేశారో నేను చాలా బాధపడతాను!" అంటూనే వెళ్ళిపోయింది.



తను అక్కడే కదలకుండా నిలబడిపోయాడు బాల్కనీలో.

శ్యామల ఉద్దేశ్యమేమిటో అతడికి అర్థం కాలేదు. తను రావాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నదా లేక తన అహాన్ని తృప్తి పరుచుకునేందుకుగాను తనను సమిధ చేస్తున్నదా?

ఒక్కసారి గూడలెగరేసి, "ఏమో?" అనుకున్నాడు నిర్లిప్తంగా.

* * *

ఆదివారం ఉదయం ఆరుగంటలకు కాలేజీ దగ్గరకు వచ్చాడు రామమూర్తి. అప్పటికే చాలామంది వచ్చి వున్నారు. ఆరు బస్సులు వరసగా పెట్టి వున్నాయి.

తన సెక్షన్ వాళ్ళ దగ్గరకు వెళ్ళి ఒక పక్కగా నిలుచున్నాడు. అందరి చేతుల్లోనూ హ్యాండ్ బ్యాగ్‌లున్నాయి.

తన చేతిలోనే ఏమీ లేదు- ఒక్క పుస్తకం తప్ప!

ఒకతను అడగనే అడిగాడు: "అదేంటి... లంచ్ తెచ్చుకోవటం లేదు!"

"లేదు... అక్కడేదో ఒకటి దొరక్కపోదుగా!" అని నవ్వి ఊరుకున్నాడు. తనకూ శ్యామల తెస్తున్నదని చెప్పలేదు గదా.

అప్పటికీ తన వెనకాల ఎవరో కిసుక్కున నవ్వినట్లే అనిపించింది- వారాలబ్బాయికి లంచ్ డబ్బాలు ఎవరు పెట్టిస్తారు అన్నట్లుగా.

లాంచిల్లో నాగార్జున కొండకు వెళ్ళారు.

ఆర్కెలాజికల్ డిపార్టుమెంటువారి మ్యూజియంలో శిల్పాల సౌందర్యం కన్నులను ఆకట్టుకుంటూనే వున్నది.

తను రాకుండా వున్నట్లయితే నిజంగా ఆ అపురూప కళాఖండాలను చూడలేకపోయి వుండేవాడు.

'థాంక్యూ శ్యామలా!' అనుకున్నాడు మనస్సులోనే రామమూర్తి.

హాల్లో ఓ మూలగా వున్న సగం విరిగిన బుద్ధుడు విగ్రహాన్ని తన్మయంగా చూస్తున్నాడు. ఆ విగ్రహం నల్లరాతి మీద చెక్కబడి వున్నది. అందులో తన పాప కనబడుతున్నదా అన్నంత నున్నగా మెరుస్తూ అద్భుతంగా వున్నది.

అవతల వరసలో పెద్దగా మాటలు. ఎవరున్నారోగూడా తెలియటం లేదుగానీ, తనతో వచ్చిన స్టూడెంట్సే గోలగోలగా మాట్లాడుకుంటున్నారు.

"శ్యామలా! మీ వారాలబ్బాయిని పట్టుకు వస్తానన్నావుగా ఏడీ... ఆ బస్సులోనే కూర్చొని పుస్తకాలు చదువుకుంటున్నాడా?" నవ్వుతూ అడిగాడు ఒకతను.

అందరూ కేరింతలు కొడుతున్నట్లుగా నవ్వారు అతడి మాటలకు.

"మీ యింటికొచ్చినప్పుడయినా నీతో మాట్లాడడా?"

"సరేలే... దిష్టిబొమ్మే! నన్నే కన్నెత్తి చూడటం లేదంటే ఈ ప్రపంచంలో ఏ ఆడదాన్ని చూస్తాడు! అని!" పకపకా నవ్వింది.

'రామమూర్తికి ఏడుపొచ్చినంతపనయింది.

చటుక్కున వెనక్కు తిరిగి బయటకువచ్చి మెట్లు దిగి అప్పుడే బయల్దేరబోతున్న లాంచిలో ఎక్కి కూర్చున్నాడు.

లాంచిలో కొద్దిమందే వున్నారు.

ఆ కదిలిపోతున్న నీటి అలల నడుమ తన జీవితం అస్పష్టంగా కనబడుతున్నది.

తన భవిష్యత్తంతా ఇంతేనా?

బస్సులో కూర్చొని- చేతిలోని పుస్తకాన్ని కళ్ళముందు పెట్టుకున్నా అక్షరాలు కనబడటంలేదు. అవమానాలు నీలి ఆకాశంమీద మబ్బుల్లా పరుగెడుతున్నాయి...

* * *

రెండుగంటలవుతుండగా విద్యార్థులంతా బిలబిలా బస్సెక్కారు.

"అదేంటి రామమూర్తిగారూ! మీ కోసం తెచ్చిన లంచ్‌ని తినకుండానే వచ్చేశారు... అసలు నాకు కనబడనే లేదు... మీ కోసం అంతా వెతికాను!" బస్సెక్కుతూనే లోపల కూర్చొనివున్న రామమూర్తిని చూస్తూ అతడి దగ్గరకు వచ్చింది.

"సారీ! ఎందుకో అక్కడ నేను ఎంజాయ్ చేయలేకపోయాను... అందుకే వచ్చేసి బస్సులో కూర్చున్నాను... మీకు ఇబ్బంది కలిగిస్తే క్షమించాలి!"

"ఇంతకీ ఏమైనా తిన్నారా లేదా?"

"ఆకలి కావటం లేదు!"

"మీరు ఇంకెవరి దగ్గరన్నా తిన్నారేమోలే అని ఈ బస్సెక్కే ముందే ఎవరో అడుక్కునేవాడు కనబడితే ఇచ్చేశాను క్యారియర్‌లోదంతా!"అన్నది శ్యామల.

'మంచి పనిచేశారు! నా మరో సోదరుడి కడుపు నింపారన్నమాట!" అన్నాడు దూరంగా కనబడుతున్న కృష్ణను చూస్తూ.

ఆమె తెచ్చిన పదార్థాలు తినకపోవటం మనస్సుకు ఎంతో ఆనందాన్ని కలిగించింది. చిన్నగా నవ్వి ఊరుకున్నాడు.

శ్యామలకు అతడి మాటలు అర్థంగాకపోయినా అతడి పెదాల మీద చిరునవ్వు ఆమెకు ఆగ్రహాన్ని కలిగించింది.

'అడుక్కునేవాడే అయినా క్యారియర్‌లోదంతా వాడి జోలెలో వేస్తుంటే నా మొఖంలోకి తృప్తిగా చూచాడు... కానీ నువ్వో- నీకోసమే తెచ్చాననే కృతజ్ఞతకూడా లేకుండా నా పొడ గిట్టనట్లే ఇక్కడకు చెప్పాపెట్టకుండా వచ్చి కూర్చున్నావు... నువ్వు అందాన్ని చూచి ఆనందించే మనస్సులేని మూర్ఖుడివి!" అనుకున్నది కసిగా శ్యామల.

మరుసటి ఆదివారం రాత్రి ఎనిమిది గంటలప్పుడు రామమూర్తి శ్యామల వాళ్ళింటికి వచ్చి వంటింటి తలుపు బయట పీటమీద కూర్చొని అరిటాకులో భోజనం చేస్తున్నాడు.

పొద్దున కావాలనే అతడు వచ్చే సమయానికి బయటకు వెళ్ళిపోయింది శ్యామల.

కనీసం- ఉదయం కనబడలేదేం- అని అడుగుతాడేమోనని అతడి వంక పదే పదే ఆశగా చూస్తున్నది.

***(మిగతా 13వ పేజీలో)***

# ఆధ్యాత్మిక అనుభవాల కదంబమాలిక

చాలాకాలంగా ప్రపంచంలో ఒక సంఘర్షణ సాగుతున్నది. అది భౌతిక- ఆధ్యాత్మిక శక్తుల మధ్య. పంచభూతాలే సర్వస్వం అనుకునే వారు ఒక వర్గం. కన్పడేదంతా మిథ్య, పరలోక సుఖమే జీవన పరమార్థం అనుకునే వారు మరొక వర్గం. ఈ సంఘర్షణలో ఎటూ తోచక సామాన్యులు నలిగిపోతున్నారు.

మరి భారతీయ ఆధ్యాత్మికవేత్తలు ఏమి చెప్పారు? వారి దృష్టిలో సృష్టి పరమేష్టి వేరు కాదు. వ్యష్టికి బహువచనమే సమష్టి- ఈ సమన్వయం పాశ్చాత్య దర్శనాలలో లోపించింది. అట్లని అక్కడ ఆధ్యాత్మికవేత్తలు పుట్టలేదు- అని కాదు కాని అలాంటి వారి సంఖ్య తక్కువ- వారిని ఆదరించిన వారు కూడా తక్కువే.

నీలంరాజు లక్ష్మీప్రసాద్‌గారు చాలాకాలంలో ఆధ్యాత్మిక రంగంలో కృషిచేసినవారు. తన అనుభూతులను సేకరించి ఎన్నో ముచ్చట్లను వారు లోగడ ఆంధ్రభూమిలో ధారావాహికంగా ప్రచురించారు. వాటిని గ్రంథ రూపంలో తెచ్చారు కూడా. ఇప్పుడు మరికొన్ని యదార్ధ సంఘటనలను వారు స్వేచ్ఛకై తపించిన జగద్గురువు అనే పేరుతో ఓ గ్రంథంగా తెచ్చారు. ఇందులోని సంఘటనలు కేవలం భారతదేశానికి చెందినవే కావు. జీసస్, మహమ్మదు వంటి ఎందరో ప్రముఖుల జీవితాలలో నిజంగా జరిగిన సంఘటనలివి. రామకృష్ణ పరమహంస పేరుమీద రాము ఐదు రూపాయలు తీసుకుంటే పరమహంస అస్వస్థుడైనాడట. ఏకనాథ్‌జీ కుల వ్యవస్థను తిరస్కరించి అంత్యజులతో భజించాడని అగ్రజులు ఆగ్రహిస్తే ఆశ్చర్యం? ఏకనాథ్ ఆయన ఇంట్లోనే ఉన్నట్లు ఒక భ్రాంతి కలిగింది- మరి అస్పృశ్యుల ఇంటిలో భుజించింది ఎవరు? ఇది సమాధానం లేని ప్రశ్న. జిడ్డుకృష్ణమూర్తి ప్రసంగాలు ఆనాటి నియంతలకు నచ్చలేదు- అందుకని ఖాళీ థియేటర్లకీ ఆయన ప్రవచనాలు చేసిన రోజులున్నాయి- ఇవన్నీ ఈ తరంవారికి తెలియని విషయాలు. ఎంతో శ్రమించి నిష్ఠతో నీలంరాజువారు వాటన్నింటినీ సామాన్య పాఠకులకు అర్థమయ్యే భాషలో అందించడం ఈ గ్రంథం ప్రత్యేకత. ఇందులో కొన్ని ముల్లా నసీరుద్దీన్ హాస్య కథలున్నాయి. అవి మన తెనాలి రామలింగడి కథల వంటివి. వాటికి రచయిత ఆధ్యాత్మిక వ్యాఖ్యానం ఇవ్వడానికి ప్రయత్నించారు. గహనమైన విషయాలను సరళతరం చేయడం నీలంరాజు లక్ష్మీప్రసాద్‌గారి కలానికి వెన్నతో పెట్టిన విద్య. ఈ గ్రంథం భిన్న భారతీయ భాషలలోనికి అనువదింపబడాలని ఆశిద్దాం! కంప్యూటర్ ముద్రణ పుణ్యమా అని రోజూ చెత్త ఎక్కువగా మార్కెటులోకి విడుదలవుతున్న ఈ రోజులలో ఈ గ్రంథం రావటం కారుచీకటిలో ఓ కాంతిరేఖ.

**-ప్రొఫెసర్ ముదిగొండ శివప్రసాద్**

**స్వేచ్ఛకై తపించిన జగద్గురువు**
**(వ్యాస సంకలనం)**
**-నీలంరాజు లక్ష్మీప్రసాద్**
**వెల: రు.70/-**
**ప్రతులకు: రచయిత: 91-3ఆర్‌టి,**
**విజయనగర్ కాలనీ, హైదరాబాద్-57**

# ఉత్తమ మినీ కవితల సంకలనం

**వెయ్యి నూట పదహార్లు**
**సంపాదకుడు: డా. రావి రంగారావు**
**వెల: 116/-: పేజీలు: 216.**
**ప్రతులకు: డా. రావి రంగారావు**
**రీడర్, ఆంధ్ర జాతీయ కాలేజ్ ఆఫ్ ఎడ్యుకేషన్,**
**మచిలీపట్నం- 521 001 కృష్ణా జిల్లా.**

470 మంది కవుల 1227 కవితలు ఈ వెయ్యి నూట పదహార్లు 'మినీ కవితా సంకలనంలో చోటుచేసుకున్నాయి. ముప్ఫై యేళ్ళలో వెలువడ్డ మినీ కవితల్ని ఎంపిక చేసి ఈ సంకలనంగా సంపాదకులు తీసుకొచ్చారు. హైకూలొచ్చాకా మినీ కవితల జోరు తగ్గిందనిపిస్తుంది. అలాగని దేని ప్రాధాన్యత దానిదే. సినారె, పురాణం, ఎమ్వీయల్, చేరా, నాగభైరవ, ఆరుద్ర, కాళోజీ లాంటి వాళ్ల మీద కూడా దీని ప్రభావం పడింది.

ఈనాడు రకరకాల ప్రక్రియలు పుట్టుకొస్తున్నాయి కవిత్వంలో. నానీలని,మామీలని, దాదీలని, చాచీలని, తాతీలని, చీట్టీలు, పొట్టీలు, పెన్మంతలు అందుకు ఉదాహరణలు. అయితే ఇవన్నీ కూడా మినీ కవితల స్ఫూర్తితో, మినీ కవితలకు సమాంతరంగా అనేక లఘు కవితా విన్యాసాలు వచ్చి చేరుతున్నట్టు ఈ గ్రంథ సంపాదకులు రంగారావుగారు పేర్కొన్నారు.

మినీ కవితల లక్ష్యం, లక్షణాలని వివరించడంతోబాటు సంకలనకర్త 'మినీ కవిత'ల నిర్మాణ శిల్పం సంవిధాన వైవిధ్యం అని చెప్పి మరో పద్దెనిమిది పాయింట్లను సోపపత్తికంగా సూచించారు. ఇవి మినీ కవిత్వం మీద సిద్ధాంత వ్యాసం వ్రాసిన వ్యక్తి చెప్పిన అంశాలు కాబట్టి గణనలోనికి తీసుకోవలసిందే. కొందరు చెప్పిన కవితల్లో ఒక్కో వాక్యం ఒక్కో డైనమైట్‌లా దూసుకుపోయింది. ఒక బుల్లెట్లు గాయం చేస్తుంది. అల్పాక్షరాల అనల్పార్థ రచన అన్నది మినీ కవిత్వానికి పూర్తిగా వర్తిస్తుంది.

ఎంతో శ్రమకోర్చి ఈ గ్రంథాన్ని వెలుగులోకి తెచ్చిన రావి రంగారావు గార్ని అభినందించకుండా ఉండలేం. రోజులు, వారాలు, పక్షాలు, నెలలు, సంవత్సరాలు కవిత్వం గురించి ఆలోచించాడు రావి. అందుకే తనదైన శైలిలో ఈ గ్రంథాన్ని వెలుగులోకి తెచ్చాడు. అజ్ఞాత కవుల్ని వారి తాలూకు కవితల్ని మనముందుంచే ప్రయత్నం చేసి, అందులో కృతకృత్యుడు కాగలిగాడు. రంగారావు మంచి సాహిత్య అనుసంధాన కార్యకర్తే కాదు. మంచి పుస్తకాల సంకలనకర్త అని కూడా ఈ గ్రంథం రుజువు చేస్తుంది.

**-డా. మంతెన**

---

*(9వ పేజీ తరువాయి)*

"నెయ్యి వెయ్యిమంటావా రామమూర్తీ?" అన్నది అతడి ఎదురుగ్గా నిల్చొని.

అతడిని ఎలాగోఅలాగ మాటల్లోకి దింపి- ఏదో ఒక మాటలో తప్పు పట్టుకొని అవమానించాలనేది ఆమె కోరిక.

"వద్దు!" అంటూనే వంట యింటి వైపుకు తిరిగి, 'అమ్మగారూ! ఇంకాస్త పచ్చడి వేయండి... మా బామ్మగూడా ఇలాగే కొబ్బరి, మామిడి కలిపి అద్భుతంగా చేసేది నా చిన్నప్పుడు!" అన్నాడు నవ్వుతూ పెద్దగా.

శ్యామలకు ఒళ్ళు మండింది. కోపంతో చేతిలోని నేతి గిన్నెను నెయ్యి ఒలికిపోయేలా పక్కనే వున్న డైనింగ్ టేబుల్ మీద విసురుగా పడేసి విసవిసా అక్కడనుంచి వెళ్ళిపోయింది.

ఏమిటి అతగాడి ఉద్దేశ్యం- తనంటే అంత నిర్లక్ష్యమా? కాలేజీలో అతడు చూడటం లేదా... కుర్రాళ్ళంతా తనంటే ఎలా పడిచచ్చేదీ... తన చుట్టూ చేరి, తననీ, తన అందాన్ని ఎలా ప్రశంసించేది... వాళ్ళెవరూ తను గీచిన గీటుదాటరే... నిప్పుల్లో దూకమన్నా - సైగ చేస్తే చాలు- దూకేస్తారే...

ఇతడేమనుకుంటున్నాడు... అన్నంకోసం అందరిళ్ళల్లో అడుక్కుతింటున్నవాడు- కనీసం తనని పలకరించనైనా పలకరించడు... అంత అహమా?... ఏం చూచుకొని అంత అతిశయం... ఒక్కసారి తన వంక మెచ్చుకోలుగా చూస్తే అతడి కొంపలేమైనా అంటుకుంటయ్యా... లేకపోతే తనని అలా చూడగానే తను మంచులా జారిపోయి అతడి కాళ్ళ మీద పడి పెళ్ళిచేసుకో బాబూ అని అడుగుతాననా... రాస్కెల్! ఆడదాని అందాన్ని మెచ్చుకోలేని ఏ మగవాడూ ఎలాంటి ఆడదానికైనా మొగుడు కాలేడు! ఒకవేళ అయినా ఆ సంసారం సఖ్యతతో నడిచి చావదు!... ఒకసారి నిలవేసి చెప్పాలి బుద్ధివచ్చేలా- అనుకున్నది విసురుగా.

రామమూర్తి భోజనం చేసి చేయి కడుక్కొని శ్యామల తల్లికి, "వెళ్ళొస్తానండీ!"అని చెప్పి బయటకు వచ్చాడు. వరండా మెట్లు దిగి పోర్టికో దాటి క్రోటన్ మొక్కల మధ్యగా నడుస్తున్నాడు.

"ఆగు!"

పోర్టికోలో గుడ్డిదీపం వెలుగుతోంది. ఆకాశంలో చంద్రుడు వెన్నెలను మంచులా చేసి కురిపిస్తున్నాడు.

చటుక్కున తలెత్తిన రామమూర్తికి అక్కడ శ్యామల కనబడింది.

"ఏమిటి నీ అహం?"

అర్థం కానట్లుగా బిత్తరపోయి ఆమె వంక చూచాడు.

"నేనంటే ఎందుకంత నిర్లక్ష్యం నీకు... నా మొఖం నీకు చాలా అసహ్యంగా కనబడుతోందా?"

మాట్లాడలేకపోయాడు. నలువైపులా చూచాడు తమని ఎవరైనా గమనిస్తున్నారేమోనన్నట్లుగా భయం భయంగా.

ఒక్కసారి గొంతు సవరించుకుంటున్నట్లుగా దగ్గాడు. "అలా అని కాదు... కన్నెత్తి మీవైపు చూచినప్పుడెల్లా నాకు మా అమ్మ గుర్తుకు వస్తున్నది!" అన్నాడు వినయంగా తల వంచుకొని.

ఉలిక్కి పడ్డట్లుగా అతడి వంక చూచింది శ్యామల. ఏం మాట్లాడుతున్నాడు అతడు?... తను అతడి తల్లిలా వుండటమేమిటి... తను అంత వయస్సు వున్నదానిలా కనబడుతున్నదా?

"ఏమిటి... మీ అమ్మలా ముసల్దానిలా అసహ్యంగా వున్నానా?"

"కాదండి... ఆమెగూడా మీలాగానే చాలా అందంగా వుండేదండి!" ఒక్కక్షణం తటపటాయిస్తున్నట్లుగా ఆగాడు. "అంతేకాదండి... మీకు లాగానే అహంభావికూడా... మగవాళ్ళంతా తన చుట్టూజేరి తన అందాన్ని మెచ్చుకుంటూ భజన చేయాలని బహు తాపత్రయ పడుతుండేదండి... నాకు ఊహ తెలిసేటప్పటికే... అలా అందరిచేతా ఆకర్షింపబడి, ఆకర్షింపబడి అపర కీచకుల చేతుల్లో పడి నాశనమయి- ఇల్లూ, ఒళ్ళూ గుల్లచేసుకుని- ఇదుగో చివరకు ఇలా నన్ను వారాలబ్బాయిని చేసి పైకి వెళ్ళిపోయిందండి!" తరువాత ఒక్క క్షణం గూడా అక్కడ వుండకుండా మెరుపులా గేటు తీసుకొని ఆ యింటి నుండి బయటకు వెళ్ళిపోయాడు రామమూర్తి. ★